మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 248 | ఆదివారం | 22 - 03 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## వైసిపి నాయకులకు బస్తిమే సవాల్



3లో..

- దేశంలో వందవ వందే భారత్ మైలురాయి
- స్లీపర్ వెర్షన్ సిద్ధం
- బుల్లెట్ రైలు ట్రాక్ పనుల్లో వేగం
- 2027లో తొలి ప్రయాణం ఖరారు
- 'కవచ్ 4.0'తో రైలు ప్రమాదాలకు చెక్
- 1300 కిలోమీటర్లకు విస్తరణ



## భారతీయ రైల్వేలో
# సరికొత్త శకం

మన గళం డెస్క్ : భారతీయ రైల్వే ముఖచిత్రం వేగంగా మారుతోంది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారైన వందే భారత్ రైళ్ల సంఖ్య ఇప్పటికే 100 దాటి మైలురాయిని చేరుకుంది. 2026 ప్రారంభంలోనే హౌరా నుండి గౌహతి (కామాఖ్య) మధ్య దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 164 వందే భారత్ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఈ రైళ్లు కేవలం వేగాన్నే కాకుండా, విమాన స్థాయి సౌకర్యాలను సామాన్య ప్రయాణీకులకు అందిస్తున్నాయి. రాబోయే కాలంలో 800 వందే భారత్ రైళ్లను పట్టాలెక్కించాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలోనే మొట్టమొదటి హైస్పీడ్ రైలు (దీబశ్రీశ్రీవ్ ంతీఖుఅఅ) ప్రాజెక్టు పనులు ఇప్పుడు కీలక దశకు చేరుకున్నాయి. ముంబై - అహ్మదాబాద్ మధ్య 508 కిలోమీటర్ల పొడవైన ఈ కారిడార్‌లో సూరత్ నుండి వాపి మధ్య 97 కిలోమీటర్ల తొలి దశను ఆగస్టు 2027 నాటికి ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఇప్పటికే గుజరాత్ విభాగంలో 17 నదులపై వంతెనల నిర్మాణం పూర్తయింది. ఈ ప్రాజెక్టు కోసం స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న 'దీ28' బుల్లెట్ రైలు సెట్లు 2026 నాటికే సిద్ధం కానున్నాయి. సముద్రం లోపల 21 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ పనులు కూడా మహారాష్ట్రలో శరవేగంగా జరుగుతున్నాయి.

ప్రయాణీకుల భద్రత విషయంలో రాజీ పడకుండా భారతీయ రైల్వే 'కవచ్ 4.0' (ఖుఋఋఎష్త్ర 4.0) వెర్షన్‌ను వేగంగా అమలు చేస్తోంది.

2 లో..



## ఇరాన్ చమురు కొనుగోలుకు
# గ్రీన్ సిగ్నల్

- ఆంక్షల సడలింపుతో భారత్‌కు ఊరట
- యుద్ధ ప్రభావంతో చమురు సంక్షోభం తీవ్రం
- దిగుమతులకు సిద్ధమవుతున్న రిఫైనరీలు

మన గళం, న్యూఢిల్లీ : ఇరాన్ నుంచి చమురు కొనుగోలుపై అమెరికా విధించిన ఆంక్షలను తాత్కాలికంగా సడలించడం భారత్‌కు ఒక ముఖ్యమైన సానుకూల పరిణామంగా మారింది. ఇప్పటివరకు ఆంక్షల కారణంగా ఇరాన్ నుంచి చమురు దిగుమతులు నిలిచిపోయిన పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఆ మార్గం మళ్లీ తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో దేశానికి చమురు సరఫరా పెరిగే అవకాశం ఉండటంతో పాటు,

2 లో..

## 'తారగిరి' సేవల్లోకి నూతన
# స్టెల్త్ యుద్ధ నౌక



- ఏప్రిల్ 3న విశాఖపట్నంలో ఆవిష్కరణ
- స్వదేశీ నౌకా సామర్థ్యానికి నిదర్శనం
- ప్రాజెక్ట్ 17ఏలో నాలుగో శక్తివంతమైన నౌక

మన గళం, విశాఖపట్నం : భారత నౌకాదళం తమ ఆధునిక శక్తిని మరింత పెంచుకునే దిశగా మరో కీలక అడుగు వేస్తోంది. నూతన స్టెల్త్ ఫ్రిగేట్ 'తారగిరి'ను ఏప్రిల్ 3, 2026న అధికారికంగా సేవల్లోకి ప్రవేశపెట్టనున్నారు. విశాఖపట్నంలో జరిగే ఈ కార్యక్రమానికి

2 లో..

## తిరుమల సేవల్లో
# సాంకేతిక విప్లవం..

- భక్తులకు అత్యున్నత సౌకర్యాలే లక్ష్యం
- ఆలయ పవిత్రత కాపాడటమే ప్రధాన లక్ష్యం
- ప్రసాదాల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ
- దర్శనంలో ఏఐ వినియోగంతో సౌలభ్యం
- సీఎం చంద్రబాబు నాయుడు



2 లో..

# నంద్యాలలో దారుణ హత్య





- ప్రియుడుతో కలిసి కుట్ర
- అదృశ్యమైన వ్యక్తి హత్యగా వెలుగులోకి
- అనైతిక సంబంధమే కారణమని వెల్లడి
- ఆధారాలు చెరిపేందుకు యాసిడ్ పోసి దహనం

నంద్యాల, మార్చి 21,మన గళం : నంద్యాల జిల్లాలో వరుసగా జరుగుతున్న హత్యలు ప్రజల్లో భయాందోళనలకు దారితీస్తున్నాయి. తాజాగా కనిపించకుండా పోయిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపుతోంది. గడివేముల మండలం భోగేశ్వరం ఆలయం సమీపంలో నివసించే శ్రీనివాసులు అనే వ్యక్తి మృతి చెందిన విషయం పోలీసుల విచారణలో బయటపడింది. శ్రీనివాసులు ఆలయంలో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా, అదే ఆలయంలో టిక్కెట్ కౌంటర్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లుతో ఆయన భార్య

2 లో..

## మధ్యాహ్న భోజన పథకంపై
# వ్యాఖ్యలు

- గరికపాటిపై విమర్శల వెల్లువ
- విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలతో వివాదం



మన గళం డెస్క్ : ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక ప్రసంగం సందర్భంగా ఆయన ఉచిత భోజనం, పుస్తకాలు, బట్టలు ఇవ్వడాన్ని తప్పుబడుతూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ముఖ్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులను "శోభనపు పెళ్లికొడుకులతో" పోల్చడం తీవ్ర విమర్శలకు కారణమైంది. విద్యార్థులు చదువు కోసం కాకుండా ఉచిత భోజనం కోసం మాత్రమే పాఠశాలకు వస్తున్నారనే భావం

2 లో..

# టీటీడీలో అపచారాల ఆరోపణలు.. శ్యామల విమర్శలు

- తిరుమలలో పరిస్థితులపై తీవ్ర వ్యాఖ్యలు
- గోవుల మరణాలు, భద్రతపై ప్రశ్నలు
- అధికారులపై ఆరోపణలు



డెస్క్, మార్చి 21 ,మన గళం : తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణపై మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు బాధ్యతలు స్వీకరించిన తర్వాత

2 లో..

# ఇరాన్ చమురు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్

అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ఒత్తిడి కొంత మేర తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి మూసివేతతో చమురు రవాణా తీవ్రంగా దెబ్బతింది. గల్ఫ్ ప్రాంతంలోని చమురు క్షేత్రాలపై దాడులు జరగడం కూడా పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగి బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచ దేశాలకు కొంత ఊరటనిచ్చేలా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ చమురు కొనుగోలుపై ఉన్న ఆంక్షలను తాత్కాలికంగా సడలిస్తూ, ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన చమురు సరఫరాకు అనుమతి ఇచ్చింది. ఏప్రిల్ 19 వరకు ఈ సడలింపు అమల్లో ఉంటుందని ప్రకటించగా, కొత్తగా ప్రారంభించే సరఫరాలకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో అదనంగా పెద్ద మొత్తంలో చమురు మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయ రిఫైనరీలు ఇరాన్ నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నాయి. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం ఉండటంతో పాటు, చెల్లింపులు ఏ కరెన్సీలో జరపాలి అనే అంశంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. అంతేకాకుండా, సముద్రంలో నిలిచిపోయిన చమురు నిల్వల పరిస్థితిపై ఇరాన్ చేసిన ప్రకటనలపై కూడా వివరణ రావాల్సి ఉంది.

మొత్తంగా చూస్తే, ఈ పరిణామం భారత్‌కు తాత్కాలిక ఉపశమనం ఇచ్చే అవకాశమున్నప్పటికీ, యుద్ధ పరిస్థితులు కొనసాగితే చమురు మార్కెట్‌లో అస్థిరత కొనసాగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో ధరల నియంత్రణ, సరఫరా భద్రత వంటి అంశాలపై భారత్ వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

# మధ్యాహ్న భోజన పథకంపై వ్యాఖ్యలు

వచ్చేలా ఆయన మాట్లాడినట్లు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలు విద్యార్థుల ఆసక్తిని తగ్గిస్తున్నాయని, అవసరమైన వస్తువులను వారు స్వయంగా సమకూర్చుకుంటేనే చదువుపై శ్రద్ధ పెరుగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే కోడిగుడ్ల లెక్కలు చూసుకోవడంలోనే ఉపాధ్యాయుల సమయం వృథా అవుతోందని కూడా పేర్కొన్నారు.

ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర ప్రతికూల స్పందన వ్యక్తమవుతోంది. పేదరికం ఎంత కఠినంగా ఉంటుందో గరికపాటికి అవగాహన లేదని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం ఒక పూట భోజనం దొరుకుతుందనే ఆశతో బడికి వచ్చే నిరుపేద పిల్లలను ఇలాంటి పోలికలతో మాట్లాడటం సరికాదని అభిప్రాయపడుతున్నారు. డ్రాపౌట్‌లను తగ్గించడానికి, విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం ఎంతో ఉపయోగకరమని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పథకాలను కించపరచడం సరైంది కాదని, సమాజంలో బలహీన వర్గాల అవసరాలను గుర్తించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. మొత్తంగా ఈ వివాదం విద్య, సంక్షేమ పథకాలపై మరోసారి చర్చను రగిలించింది. గరికపాటి వ్యాఖ్యలపై ప్రజల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, సామాజిక బాధ్యతతో మాట్లాడాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తు చేస్తోంది.

# భారతీయ రైల్వేలో సరికొత్త శకం



ఇది స్వదేశీ అటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్, ఇది ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి ప్రమాదాలను నివారిస్తుంది. జనవరి 2026 నాటికి ఈ వ్యవస్థను 1,300 కంటే ఎక్కువ రూట్ కిలోమీటర్లకు విస్తరించారు. ముఖ్యంగా ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా వంటి రద్దీ మార్గాల్లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సాంకేతికత వల్ల రైలు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని రైల్వే నిపుణులు భావిస్తున్నారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణలో భాగంగా 'అమృత్ భారత్' పథకం కింద 1,300 కంటే ఎక్కువ స్టేషన్లను ప్రపంచ స్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారు. డిజిటల్ టికెటింగ్, స్టేషన్లలో వై-ఫై, అధునాతన వెయిటింగ్ హాళ్లు వంటివి ప్రయాణీకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. కేవలం వేగం, భద్రత మాత్రమే కాకుండా స్వచ్ఛతకు కూడా రైల్వే శాఖ పెద్దపీట వేస్తోంది. 2026 నాటికి మరిన్ని నగరాల మధ్య వందే మెట్రో రైళ్లను కూడా ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మొత్తానికి భారతీయ రైల్వే ప్రపంచంలోనే అత్యుత్తమ రవాణా వ్యవస్థగా ఎదిగేందుకు అడుగులు వేస్తోంది.

# 'తారగిరి' సేవల్లోకి నూతన స్టెల్త్ యుద్ధ నౌక



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమం దేశం సంపూర్ణ స్వావలంబన నౌకా శక్తిగా ఎదుగుతున్న దిశలో ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో నిర్మించిన ఈ నౌక, స్వదేశీ సాంకేతికత మరియు ఇంజినీరింగ్ సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తోంది. భారత నౌకా రంగం సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే సందర్భంగా ఈ ఆవిష్కరణ నిలవనుంది. ప్రాజెక్ట్ 17ఏ కింద రూపొందించిన నౌకల్లో తారగిరి నాలుగోది. సుమారు 6,670 టన్నుల బరువుతో ఈ స్టెల్త్ ఫ్రిగేట్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించబడింది. శత్రువులకు కనిపించకుండా పని చేసే సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు, అధిక స్థాయి రక్షణ లక్షణాలు ఈ నౌక ప్రత్యేకతలు. భారత నౌకా దళానికి ఈ నౌక చేరికతో సముద్ర భద్రత మరింత బలపడనుంది. తీర ప్రాంతాల రక్షణతో పాటు, అంతర్జాతీయ జలాల్లో భారత ఉనికిని మరింత బలోపేతం చేయడంలో తారగిరి కీలక పాత్ర పోషించనుంది. ఇది దేశ భద్రతకు ఒక పెద్ద బలం కానుంది. మొత్తంగా చూస్తే, తారగిరి ఆవిష్కరణ దేశ రక్షణ రంగంలో స్వయం సమృద్ధి వైపు తీసుకున్న గొప్ప అడుగుగా నిలుస్తోంది. స్వదేశీ నిర్మాణ సామర్థ్యాన్ని పెంపొందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఆధునిక యుద్ధ నౌకల నిర్మాణానికి ఇది మార్గదర్శకంగా నిలవనుంది.

# తిరుమల సేవల్లో సాంకేతిక విప్లవం..



తిరుమల, మార్చి 21,మన గళం : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పవిత్రతను కాపాడుతూ భక్తుల విశ్వాసానికి మరింత బలం చేకూర్చేలా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో టీటీడీ అధికారులకు ఆయన కీలక దిశానిర్దేశాలు చేశారు. భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, వారికి ఇబ్బందులు లేకుండా సక్రమంగా సేవలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రసాదాల తయారీలో నాణ్యతకు ఎలాంటి రాజీ పడకూడదని సీఎం స్పష్టం చేశారు. నెయ్యి, పప్పులు, ఇతర ముడి పదార్థాలన్నీ కచ్చితమైన ప్రమాణాలతో ఉండేలా ఏర్పాటు చేసిన ఆధునిక ప్రయోగశాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రసాదాల విషయంలో భక్తుల విశ్వాసం అత్యంత ముఖ్యమని, కల్తీకి ఏమాత్రం అవకాశం ఉండకూడదని హెచ్చరించారు. ప్రతి దశలో నాణ్యత పరీక్షలు నిర్వహించి, ప్రమాణాలు పాటించేలా చూడాలని సూచించారు.

భక్తులు క్యూలైన్లలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు సాంకేతికతను వినియోగించాలని సీఎం సూచించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టి దర్శన ప్రక్రియను వేగవంతం చేయాలని, రద్దీ నియంత్రణలో ఆధునిక విధానాలు అమలు చేయాలని పేర్కొన్నారు. భక్తులకు సమయం ఆదా కావడంతో పాటు, సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. అన్నప్రసాద సేవలను మరింత విస్తరించాలన్న దిశగా కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం తిరుమలతో పాటు 57 దేవాలయాల్లో అన్నప్రసాదం అందిస్తున్నామని అధికారులు వివరించగా, త్వరలోనే మరో నాలుగు దేవాలయాల్లో ఈ సేవను ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తులకు నాణ్యమైన భోజనం అందించడం ద్వారా వారి యాత్ర అనుభవాన్ని మరింత మెరుగుపరచాలని సీఎం ఆకాంక్షించారు. తిరుమలలో భక్తులకు అందించే అన్ని సేవలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, ఎక్కడా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. భద్రత, పరిశుభ్రత, తాగునీరు, వసతి వంటి అంశాల్లో కూడా అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు, టీటీడీ ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు. మొత్తంగా తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

# నంద్యాలలో దారుణ హత్య

వరలక్ష్మీకి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరి మధ్య అనైతిక సంబంధం కొనసాగింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాసులు తరచూ గొడవలు పడుతూ, భార్యపై వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. మార్చి 10న మద్యం తాగి వచ్చిన శ్రీనివాసులు భార్యతో ఘర్షణకు దిగగా, వరలక్ష్మీ తోసేయడంతో ఆయన కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయే స్థితిలో ఉన్న అతన్ని చంపేందుకు వరలక్ష్మీ తన ప్రియుడు వెంకటేశ్వర్లును పిలిపించింది. ఇద్దరూ కలిసి గొంతు నులిమి హత్య చేశారు.

హత్య అనంతరం ఆనవాళ్లు లేకుండా చేయడానికి మృతదేహంపై యాసిడ్ పోసి, ఆలయం వెనుక భాగంలో కాల్చి దాచిపెట్టారు. రెండు రోజుల పాటు కనిపించకపోవడంతో శ్రీనివాసుల తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు. కాల్ డేటా ఆధారంగా వరలక్ష్మీపై అనుమానం రావడంతో కేసు మలుపు తిరిగింది. చివరికి వరలక్ష్మీ, వెంకటేశ్వర్లు తహశీల్దార్ ముందు లొంగిపోయి నేరాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని, మృతదేహ అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన జిల్లాలో తీవ్ర సంచలనంగా మారింది.

# టీటీడీలో అపచారాల ఆరోపణలు.. శ్యామల విమర్శలు



కొండపై అపచారాలు పెరిగాయని శ్యామల ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. శ్యామల మాట్లాడుతూ తిరుమలలో పలు సంఘటనలను ప్రస్తావించారు. గోవుల మరణాలు, మద్యం లభ్యత వంటి అంశాలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని అన్నారు. అదేవిధంగా తొక్కిసలాటల కారణంగా భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలను కూడా ప్రస్తావిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. క్యూలైన్లలో తాగునీటి సదుపాయం లేకపోవడం, లడ్డూ ప్రసాదం నాణ్యత, భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశాల్లో అధికారులు వాస్తవాలను వెల్లడించడం లేదని, అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

ఈ ఆరోపణలపై టీటీడీ అధికారుల నుంచి ఇంకా స్పందన రావాల్సి ఉంది. తిరుమల వంటి ఆధ్యాత్మిక కేంద్రంలో ఇలాంటి సమస్యలు తలెత్తడం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. సమస్యలను వెంటనే పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. మొత్తంగా ఈ అంశం రాజకీయంగా వేడెక్కుతోంది. తిరుమల నిర్వహణ, భక్తుల సౌకర్యాలపై ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## వైసిపి నాయకులకు బస్తిమే సవాల్



మన గళండోన్ పాత్రికేయసమావేశాలలో చిటికెలు వేయడం తొడలు కొట్టడం,మీసాలు దువ్వడం వంటి పనులు వైసీపీ పార్టీ నాయకులకి తగదని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతోమాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని కష్టాలలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాల నియా మకాలు చేపట్టడం యువతకు ప్రోత్సాహకరమని తెలిపారు. ఎన్నికల వాగ్దానాలలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అన్నిటిని నెరవేరుస్తున్నారని అన్నారు. త్వరలో మైనింగ్ కాలేజీ, రింగురోడ్, అరటి రైతులకు నష్ట నివారణ చర్యలు త్వరలో చేపడుతామని, డోన్ ,ప్యాపిలి మండలాలలో రోడ్ల పెండింగ్ పనులు పూర్తి చేస్తామని అలాగే జలదుర్గం, చంద్రపల్లి, హుసేనాపురం,గార్లదిన్నె గ్రామాలకు త్రాగు సాగు నీటి సౌకర్యం కల్పించాలని కృషి చేస్తున్నామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతాలు లేవని వ్యక్తిగత విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని,ఆ పార్టీ భూస్థాపితం అయిందన్నారు. వారి హాయంలో తమలపాకు లాంటి తారు రోడ్లు, రేకుల భవనాలు నిర్మించడం చూసి వాపును బలుపు అనుకుంటున్నారని ఇవి టిడిపి హాయంలో చెల్లవని తెలిపారు. త్వరలో డోన్ లో రింగ్ రోడ్డు, పాత పేట లోని వైద్యశాలలో కిడ్నీ సెంటర్ ప్రారంభిస్తామని తెలిపారు.టిడిపి నాయకులను రెచ్చగొట్టడం, చిల్లర నాయకులు విమర్శలు చేయడం మానుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కోట్ల తీవ్రంగా హెచ్చరించారు.

## భక్తి శ్రద్ధలతో (రంజాన్) ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు



మన గళం బనగానపల్లె : ముస్లింలు పరమ పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వదినం వేడుకలను బనగానపల్లెలో ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిపారు. పట్టణంలోని అన్ని మసీదుల్లో, ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. సామూహిక ప్రార్థనలతో మసీదులు, ఈద్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు కొనసాగించిన ముస్లిములు శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్ష విరమించారు. ఉదయం 9 గంటలకే ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి పెద్దఎత్తున ఈద్గాకు తరలివచ్చి దైవ ప్రార్థనలో పాల్గొన్నారు. .ప్రతి ఒక్కరు కొత్త వస్త్రాలు ధరించి పరిమళద్రవ్యాలు చల్లుకుని రావడంతో వాతావరణం అంతా ఆహ్లాదకరంగా మారింది. ప్రార్థనల అనంతరం పేద,ధనిక తారతమ్యం లేకుండా సహృదయ, సద్భావనాలతో ప్రతి ఒక్కరు ఆలింగనం చేసుకుని ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. హిందూ, ముస్లిం సోదరులు ప్రతి ఒక్కరు మతసామరస్యాన్ని కాపాడుతూ అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలని మతపెద్దలు తన సందేశాన్ని ఇచ్చారు. ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ఈద్గా వద్ద, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో గ్రామపంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బనగానపల్లె రూరల్ సిఐ మంజునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై కల్పనల పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

## ముగియనున్న ఉగాది ఉత్సవాలు

మనగళం శ్రీశైలం : ఉగాది ఉత్సవాలలో భాగంగా ఈ రోజు (20.03.2026) సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, అమ్మవారికి భ్రమరాంబాదేవి నిజాలంకరణ కార్యక్రమాలు జరిపించబడుతాయి.

అశ్వవాహనసేవ : వాహనసేవలో భాగంగా శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడుతాయి. అశ్వవాహనాధీశులైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించడం వలన సమస్యలు తీరిపోతాయని, సంతానార్థులకు సంతానం కలుగుతుందని చెప్పబడుతోంది.

నిజాలంకరణ : ఉగాది మహోత్సవాలలో చేయబడుతున్న అలంకారాలలో భాగంగా ఈ సాయంకాలం శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని భ్రమరాంబాదేవి నిజాలంకరణ స్వరూపంలో అలంకరింపజేయడం జరుగుతుంది. అష్టభుజాలను కలిగిన ఈ దేవి శూలం, బాకు, గద, ఖడ్గం, విల్లు, డాలు, పరిఘ మొదలైన ఆయుధాలను ధరించి జగన్మాతగా దర్శనమిస్తుంది. అమ్మవారి నిజాలంకరణ దర్శనం వలన సమస్యలన్నీ తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది. కాగా పూజాదికాల తరువాతా ఆలయప్రాంగణములో ప్రదక్షణగా ఉత్సవమూర్తులకు ఆలయ ఉత్సవం నిర్వహించబడుతుంది. ఈ సాయంకాలం జరుగనున్న ఆలయ ఉత్సవంతో ఉగాది ఉత్సవాలు పూర్తవుతాయి.

## శ్రీశైలం హుండీల లెక్కింపు







మనగళం శ్రీశైలం :ఈ రోజు (21.03.2026 ) జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 7,19,58,064- నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 30 రోజులలో (19.02.2026 నుండి 20.03.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 122 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 6 కేజీల 550 గ్రాముల వెండి లభించాయి.అదేవిధంగా 624 - యుఎస్ఏ డాలర్లు, 210 యు.ఎ.ఇ దిర్హమ్స్, 6 - సౌదీరియాల్స్, 10 సింగపూర్ డాలర్లు , 20 ఇంగ్లాండు పౌండ్స్ , 14 మలేషియా రింగిట్స్ , 25 ఆస్ట్రేలియా డాలర్లు, 70 - యూరోలు, 1 కువైట్ దినార్, 60 కెనడా డాలర్లు, 20 న్యూజిలాండ్ డాలర్లు మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అదేవిధంగా ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి జి. లక్ష్మీశ్వరి, శ్రీమతి యు. సుబ్బలక్ష్మి, శ్రీమతి జిల్లెల శ్రీదేవి, పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు హుండీ లెక్కింపు పర్యవేక్షణలో పాల్గొన్నారు. హుండీల లెక్కింపులో సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల చోరీ కలకలం

- యుద్ధ ప్రభావంతో సరఫరాలో కొరత
- బ్లాక్ మార్కెట్‌తో పాటు దొంగతనాలు పెరుగుదల
- సీసీటీవీ వీడియో వైరల్



బెంగళూరు, మార్చి 21 మనగళం : ఇరాన్ యుద్ధం ప్రభావంతో దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో కొరత నెలకొన్న నేపథ్యంలో, గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌తో పాటు చోరీలు కూడా పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కర్ణాటక రాజధాని బెంగళూరులో జరిగిన గ్యాస్ సిలిండర్ల దొంగతనం కలకలం రేపింది. హెల్మెట్లు ధరించి స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అపార్ట్‌మెంట్‌లోకి చొరబడి సిలిండర్లను అపహరించడం స్థానికంగా భయాందోళనలకు దారితీసింది. బేగూర్ ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకున్న నిందితులు గురువారం సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. ఆ సమయంలో నివాసితులు ఉగాది పండుగ సంబరాల్లో నిమగ్నమై ఉండటంతో అపార్ట్‌మెంట్‌లో కదలికలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే అవకాశంగా భావించిన దుండగులు పథకం ప్రకారం చోరీకి పాల్పడ్డారు. ఒకరు గేటు తెరిచి లోపలికి వెళ్లగా, మరొకరు బయట స్కూటీ వద్ద వేచి ఉన్నాడు.

లోపలికి వెళ్లిన నిందితుడు ఒక ఇంటిని టార్గెట్ చేసి అక్కడి నుంచి రెండు గ్యాస్ సిలిండర్లను బయటకు తీసుకొచ్చాడు. ఎవరూ గమనించకుండా నెమ్మదిగా వాటిని గేటు వద్దకు తీసుకొచ్చి, అనంతరం స్కూటీని లోపలికి తీసుకువచ్చాడు. రెండు సిలిండర్లను స్కూటీపై అమర్చి, బయట ఉన్న తన సహచరుడితో కలిసి అక్కడి నుంచి వేగంగా పారిపోయాడు. ఈ మొత్తం ఘటన కొద్ది నిమిషాల్లోనే జరిగిపోయినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్లు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించగా, ఇద్దరు వ్యక్తులు చోరీ చేసిన విషయం బయటపడింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గ్యాస్ కొరత నేపథ్యంలో ఇలాంటి దొంగతనాలు పెరిగే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అపార్ట్‌మెంట్‌లలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు.



## బంగారం ధరలు భారీగా తగ్గాయి



హైదరాబాద్, మార్చి 21, మన గళం : దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు భారీగా తగ్గుతూ వినియోగదారులకు గుడ్‌న్యూస్ అందిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల ప్రభావంతో భారత మార్కెట్‌లో పసిడి ధరలు క్రమంగా పడిపోతున్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే ఈ రోజు గణనీయంగా తగ్గుదల కనిపించడం విశేషం. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నిన్న 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,910 ఉండగా, 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,36,550గా నమోదైంది. అయితే ఈ రోజు 24 క్యారెట్‌పై రూ.2,940 తగ్గి రూ.1,45,970కి చేరగా, 22 క్యారెట్‌పై రూ.2,750 తగ్గి రూ.1,33,800 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం మాత్రమే కాకుండా వెండి ధరలు కూడా భారీగా పతనమయ్యాయి. నిన్న కిలో వెండి రూ.2,60,000 వద్ద ఉండగా, ఈ రోజు రూ.10,000 తగ్గి రూ.2,50,000కి పడిపోయింది. అలాగే 100 గ్రాముల వెండి ధర రూ.26,000 నుంచి రూ.25,000కి తగ్గింది. ఈ తగ్గుదలతో పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నప్పటికీ, మార్కెట్‌లో ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు ఇదే స్థాయిలో ఉన్నాయి. చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,970గా కొనసాగుతుండగా, ఢిల్లీలో రూ.1,46,120గా నమోదైంది. అహ్మదాబాద్, వడోదరా వంటి నగరాల్లో స్వల్పంగా ఎక్కువగా ఉంది. మొత్తానికి అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్ మార్పిడి విలువలు, పెట్టుబడిదారుల ప్రవర్తన వంటి అంశాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ధరలు తగ్గిన నేపథ్యంలో కొనుగోలుదారులకు ఇది అనుకూల సమయమా కాదా అన్నది మార్కెట్ పరిస్థితులను బట్టి నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

## బీఎస్ఎన్ఎల్-వీఐ మాస్టర్ ప్లాన్




హైదరాబాద్, మార్చి 21 , మన గళం : దేశంలోని టెలికాం రంగంలో పెరుగుతున్న పోటీ మధ్య ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు దీమీ మరియు సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పరస్పరం సహకరించుకుంటూ నెట్‌వర్క్, మౌలిక సదుపాయాలను పంచుకోవాలని ఈ రెండు సంస్థలు నిర్ణయించుకున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రధానంగా ఖర్చులను తగ్గించుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొత్త టవర్లు నిర్మించడం, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ వంటి భారీ పెట్టుబడులను తగ్గించేందుకు ఇప్పటికే ఉన్న సదుపాయాలను ఒకరికొకరు వినియోగించుకోనున్నారు. దీంతో రెండు సంస్థలకు ఆర్థికంగా ఊరట లభించే అవకాశం ఉంది. ఇక నెట్‌వర్క్ కవరేజ్ పరంగా కూడా ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. బీఎస్ఎన్ఎల్ గ్రామీణ ప్రాంతాల్లో బలమైన నెట్‌వర్క్ కలిగి ఉండగా, వీఐ పట్టణ ప్రాంతాల్లో మంచి పరిధి కలిగి ఉంది. ఈ రెండు నెట్‌వర్క్‌లు కలిస్తే వినియోగదారులకు మెరుగైన సిగ్నల్, డేటా సేవలు అందే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. అలాగే 4జీ, 5జీ సేవల విస్తరణను వేగవంతం చేయడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను విస్తరిస్తుండగా, వీఐ మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ మరింత వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. మొత్తంగా ఈ ఒప్పందం టెలికాం రంగంలో పోటీని కొనసాగించడమే కాకుండా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థగా బీఎస్ఎన్ఎల్ ఉండగా, వోడాఫోన్ ఐడియాలో కేంద్ర ప్రభుత్వానికి గణనీయమైన వాటా ఉండటంతో ఈ భాగస్వామ్యం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఏప్రిల్ 1 నుంచి టాటా కార్ల ధరల పెంపు




హైదరాబాద్, మార్చి 21, మన గళం : దేశంలోని ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఝు వీశీశీతీం తన ప్యాసింజర్ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం సగటున 0.5 శాతం వరకు ధరలను పెంచనుంది. అయితే ఈ పెంపు వాహనం మోడల్, వేరియంట్‌ను బట్టి మారే అవకాశం ఉంది. ఇప్పటికే కమర్షియల్ వాహనాల విభాగంలో ధరలను పెంచిన సంస్థ, ఇప్పుడు వ్యక్తిగత కార్ల విభాగంలోనూ అదే విధానాన్ని అమలు చేస్తోంది. పెరుగుతున్న తయారీ వ్యయాలు, ముడి పదార్థాల ఖర్చులు పెరగడం వంటి కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వర్గాలు పేర్కొన్నాయి. టాటా పంచ్, నెక్సాన్, హారియర్, సఫారీ వంటి ప్రజాదరణ పొందిన మోడళ్లపై ఈ పెంపు ప్రభావం చూపనుంది. పాత ధరలకే వాహనం కొనుగోలు చేయాలనుకునే వారు మార్చి నెలాఖరు లోపు కొనుగోలు చేయడం మంచిదని మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. ఈ ధరల పెంపు వినియోగదారులపై పెద్దగా భారం కాకపోయినా, టాప్ వేరియంట్లు కొనుగోలు చేసే వారికి మాత్రం వేల రూపాయల మేర వ్యత్యాసం కనిపించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో కూడా ఈ పెంపు వర్తిస్తుందా లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయినప్పటికీ భద్రత, నాణ్యత విషయంలో వినియోగదారుల విశ్వాసం ఉన్నందున ఈ స్వల్ప పెంపు అమ్మకాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నెలకు రూ.2200 జమ చేస్తే రూ.1.57 లక్షలు



న్యూఢిల్లీ, మార్చి 21 ,మన గళం : ప్రభుత్వ హామీతో సురక్షిత పెట్టుబడిగా భావించే పోస్టాఫీస్ పథకాలు మళ్లీ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా చిన్న మొత్తాలతో పెద్ద నిధిని సృష్టించుకోవాలనుకునే వారికి రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ) స్కీమ్ మంచి ఎంపికగా మారుతోంది.

ప్రస్తుతం పోస్టాఫీస్ ఆర్డీ పథకంపై వార్షికంగా సుమారు 6.7 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ స్కీమ్‌లో మీరు నెలకు రూ.2200 చొప్పున 5 సంవత్సరాలు (60 నెలలు) పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ సమయానికి మొత్తం రూ.1,57,004 పొందే అవకాశం ఉంది. ఇందులో మీ మొత్తం డిపాజిట్ రూ.1,32,000 కాగా, వడ్డీ రూపంలో రూ.25,004 అదనంగా లభిస్తుంది.

ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే, కనీసం రూ.100తోనే ఖాతా ప్రారంభించవచ్చు. అలాగే ఖాతా తెరిచిన మూడు సంవత్సరాల తర్వాత అవసరమైతే మూసివేసే అవకాశం కూడా ఉంది. పోస్టాఫీస్ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో పెట్టుబడిపై పూర్తి భద్రత ఉంటుంది.

నేటి పరిస్థితుల్లో మార్కెట్‌లో ఉన్న రిస్కీ ఇన్వెస్ట్‌మెంట్‌లకు బదులుగా, స్థిరమైన రాబడి కోరుకునే వారికి ఈ పథకం మంచి ఎంపికగా ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. చిన్న మొత్తాలతో పెద్ద లక్ష్యాలను చేరుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగకరంగా మారుతుంది.

# భూటాన్‌తో యూపీఐ లావాదేవీలు సులభం




న్యూఢిల్లీ, మార్చి 21 ,మన గళం :భారత డిజిటల్ చెల్లింపు వ్యవస్థ మరింత విస్తరిస్తూ సరిహద్దులు దాటుతోంది. ఈ క్రమంలో భారత్, భూటాన్ దేశాల మధ్య డిజిటల్ చెల్లింపులను సులభతరం చేయడానికి కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య డబ్బు బదిలీ మరింత వేగంగా, తక్కువ ఖర్చుతో జరిగే అవకాశం ఉంది.ఈ మేరకు భారత పోస్టల్ శాఖ మరియు భూటాన్ పోస్టల్ శాఖల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అభివృద్ధి చేసిన 'పాస్‌ట్రాన్స్‌ఫర్' వ్యవస్థను యూపీఐతో అనుసంధానం చేసి ఈ సేవలను అందించనున్నారు. పోస్టల్ నెట్‌వర్క్‌ను వినియోగిస్తూ నగదు బదిలీని అమలు చేయడం ఈ ఒప్పందంలో ప్రధాన అంశంగా నిలిచింది.ఈ భాగస్వామ్యం కేవలం డబ్బు బదిలీకే పరిమితం కాకుండా పలు రంగాలకు విస్తరించనుంది. పోస్టల్ కార్యకలాపాలు, సాంకేతిక అభివృద్ధి, లాజిస్టిక్స్, తపాలా బిళ్లల సేకరణ వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. భూటాన్ పోస్టల్ అధికారులకు భారత్‌లోని ప్రతిష్ఠాత్మక శిక్షణా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే డిజిటల్ పోస్టల్ సిస్టమ్స్, డిజిటల్ అడ్రస్ కోడ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని భూటాన్‌తో పంచుకోవడానికి భారత్ ముందుకొచ్చింది. ఈ ఒప్పందంతో ఇరు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక బంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు డిజిటల్ సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు

న్యూఢిల్లీ, మార్చి 21 , మన గళం : దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారులకు కీలక మార్పులు తీసుకురానున్న కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఈ నిబంధనలు 2025 ఆదాయపు పన్ను చట్టాన్ని అమలు చేసే దిశగా రూపొందించబడ్డాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో పన్ను విధానాల్లో స్పష్టత, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు తీసుకువచ్చారు.కొత్త నిబంధనల ప్రకారం ఆస్తుల హోల్డింగ్ పీరియడ్ విషయంలో స్పష్టత ఇచ్చారు. బాండ్లు, డిబెంచర్లు, డిపాజిట్ సర్టిఫికేట్లు వంటి పెట్టుబడులను తర్వాత షేర్లు లేదా ఇతర ఆస్తులుగా మార్చినప్పుడు, వాటి హోల్డింగ్ కాలాన్ని కొత్తగా లెక్కించకుండా, మొదట పెట్టుబడి పెట్టిన సమయం నుంచే పరిగణనలోకి తీసుకుంటారు. ఇది పెట్టుబడిదారులకు ప్రయోజనకరంగా మారనుంది.అలాగే ఆదాయ ప్రకటన పథకం కింద వెల్లడించిన ఆస్తుల విషయంలో కూడా ప్రత్యేక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. భూమి, ఇల్లు వంటి స్థిరాస్తులపై హోల్డింగ్ కాలాన్ని అసలు కొనుగోలు తేదీ నుంచి లెక్కిస్తారు. ఇతర ఆస్తుల విషయంలో అయితే 2016 జూన్ 1 నుంచి గణన ప్రారంభమవుతుంది.విదేశీ కంపెనీలకు సంబంధించిన నిబంధనల్లో కూడా మార్పులు చేశారు. విదేశీ సంస్థల బ్రాంచ్‌లను భారతదేశంలో అనుబంధ సంస్థలుగా మార్చినప్పుడు, ఆస్తుల యాజమాన్య కాలాన్ని కూడా కలిపి లెక్కించనున్నారు. దీంతో పన్ను లెక్కల్లో స్పష్టత పెరుగుతుంది.డివిడెండ్ చెల్లింపుల విషయంలో కూడా కఠిన నియమాలు అమలు చేయనున్నారు. కంపెనీలు తమ భాగస్వాముల పూర్తి వివరాలను నమోదు చేయడం తప్పనిసరి. అలాగే డివిడెండ్ ఆమోదించే సమావేశాలు, చెల్లింపులు భారత్‌లోనే జరగాలి.

# సంపాదకీయం

## ప్లాస్టిక్ రక్కసి: భూమికి పెనుముప్పు

ఆధునిక మానవ జీవనశైలిలో ప్లాస్టిక్ ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది. ఉదయం లేచిన దగ్గరి నుండి రాత్రి పడుకునే వరకు మనం వాడే వస్తువులలో అత్యధికం ప్లాస్టిక్ నిర్మితాలే. అయితే, ఈ సౌకర్యం వెనుక దాగి ఉన్న ప్రమాదం ఊహాతీతం. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి వందల ఏళ్లు పడుతుంది. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా, భూమి యొక్క సారవంతం దెబ్బతింటోంది. ఏటా లక్షలాది టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతూ, సముద్ర జీవరాశిని అంతం చేస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు తిన్న మూగజీవాలు ప్రాణాలు కోల్పోవడం మనం నిత్యం చూస్తున్న విషాదం. ఈ రక్కసి నుండి భూమిని కాపాడుకోకపోతే భవిష్యత్ తరాలకు మనం ఒక విషపూరితమైన గ్రహాన్ని మిగిల్చిన వారమవుతాం. ప్లాస్టిక్ రసాయనాలు మట్టిలోని సూక్ష్మజీవులను చంపేసి భూమిని నిస్సారంగా మారుస్తున్నాయి. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టం కేవలం పర్యావరణానికే పరిమితం కాలేదు, అది నేరుగా మానవ ఆరోగ్యంపై దాడి చేస్తోంది. ప్లాస్టిక్ వస్తువులు క్రమంగా విచ్ఛిన్నమై మైక్రో ప్లాస్టిక్స్ (అతి సూక్ష్మ కణాలు)గా మారుతున్నాయి. ఇవి మనం తాగే నీరు, తినే ఆహారం మరియు పీల్చే గాలి ద్వారా మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల జరిగిన పరిశోధనల్లో మానవ రక్తంలో మరియు తల్లి పాలలో కూడా ఈ ప్లాస్టిక్ కణాలు ఉన్నట్లు తేలడం భయాందోళన కలిగిస్తోంది. వీటివల్ల క్యాన్సర్, హార్మోన్ల అసమతుల్యత మరియు శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ డబ్బాల్లో వేడి ఆహారాన్ని ఉంచడం, ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగడం వల్ల రసాయనాలు కరిగి శరీరంలోకి చేరుతున్నాయి. ఇది ఒక నిశ్శబ్ద హంతకిలా సమాజాన్ని పీడిస్తోంది. మన ఇళ్లలో వాడే ప్లాస్టిక్ బాటిళ్లు, బాక్సుల వల్ల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నియంత్రణకు చట్టాలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో అమలు ఆశించినంత వేగంగా జరగడం లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్) పై నిషేధం ఉన్నప్పటికీ, మార్కెట్లలో అది ఇంకా దర్శనమిస్తూనే ఉంది. కేవలం జరిమానాలు వేయడం ద్వారానే ఈ సమస్య పరిష్కారం కాదు. ప్లాస్టిక్ తయారీ యూనిట్లపై నిఘా పెంచడంతో పాటు, ప్రజల్లో అవగాహన కల్పించడం అత్యవసరం. ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా మార్చాలి. రోడ్ల నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వాడటం వంటి వినూత్న ప్రయోగాలు జరుగుతున్నా, అవి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాల పరిమాణంతో పోలిస్తే చాలా తక్కువ. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ఒక సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడు గుర్తించాలి. మున్సిపల్ యంత్రాంగం ప్లాస్టిక్ సేకరణలో మరింత పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంది. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ఇప్పుడు అత్యంత కీలకమైన అంశం. జనపనార సంచులు, గుడ్డ సంచులు మరియు కాగితపు సంచులను వాడటం అలవాటు చేసుకోవాలి. వెదురుతో చేసిన వస్తువులు, మట్టి పాత్రలు ప్లాస్టిక్ కు చక్కని ప్రత్యామ్నాయాలుగా నిలుస్తాయి. పర్యావరణ హితమైన బయో-డిగ్రేడబుల్ ప్లాస్టిక్ పరిశోధనలకు ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలి. వ్యాపార సంస్థలు తమ ప్యాకేజింగ్ విధానాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, రీసైకిల్ చేయదగ్గ పదార్థాలను వాడాలి. మనం చేసే ఒక చిన్న మార్పు, అంటే బజారుకు వెళ్ళేటప్పుడు ఒక గుడ్డ సంచిని వెంట తీసుకెళ్లడం, వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టగలదు. ఇదొక ప్రజా ఉద్యమంగా మారాల్సిన సమయం ఆసన్నమైంది. పర్యావరణ హిత వస్తువుల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. సముద్ర పర్యావరణ వ్యవస్థపై ప్లాస్టిక్ ప్రభావం అత్యంత భయంకరంగా ఉంది. ఏటా వేల సంఖ్యలో తిమింగలాలు, తాబేళ్లు, సముద్ర పక్షులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భ్రమించి తిని మరణిస్తున్నాయి. సముద్రాల అడుగున ప్లాస్టిక్ పొరలు ఏర్పడటం వల్ల ఆక్సిజన్ అందక పగడపు దీవులు అంతరించిపోతున్నాయి. ఇది కేవలం సముద్ర జీవులకే కాదు, మనుషులకు కూడా ప్రమాదకరం. ఎందుకంటే మనం తినే సముద్ర ఆహారం ద్వారా ఆ ప్లాస్టిక్ రసాయనాలు తిరిగి మన శరీరంలోకే చేరుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడం పర్యాటక రంగంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. సముద్రాలను శుభ్రపరిచే భారీ ప్రాజెక్టులకు అంతర్జాతీయ సహకారం అవసరం. నీలి ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ రహిత సముద్రాలు కావాలి. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలు స్తంభించిపోవడానికి ప్లాస్టిక్ ప్రధాన కారణం. వర్షం పడినప్పుడు ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు నాలాల్లో ఇరుక్కుపోయి నీరు నిలిచిపోతోంది. దీనివల్ల నగరాల్లో వరదలు రావడం, అంటువ్యాధులు ప్రబలడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మురికివాడల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల డైఆక్సిన్లు వంటి అత్యంత విషపూరిత వాయువులు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. ఇది గాలి నాణ్యతను దెబ్బతీసి ప్రజల్లో ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తోంది. చెత్తను తగులబెట్టే పద్ధతికి స్వస్తి చెప్పి, ప్లాస్టిక్ ను వేరుచేసి శాస్త్రీయంగా విచ్ఛిన్నం చేయాలి. నగర పాలక సంస్థలు ప్లాస్టిక్ రహిత నగరాల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. వ్యవసాయ రంగంలో కూడా ప్లాస్టిక్ కాలుష్యం తీవ్రమవుతోంది. పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు నిండిపోవడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదు. దీనివల్ల భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. పంటల వేర్లు లోపలికి చొచ్చుకుపోవడానికి ప్లాస్టిక్ అడ్డుగా మారుతోంది, ఫలితంగా దిగుబడి తగ్గుతోంది. రైతులు తమ పొలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పారేయకుండా జాగ్రత్త వహించాలి. మట్టిలో ప్లాస్టిక్ కణాలు చేరడం వల్ల పంటల పోషక విలువలు కూడా మారుతున్నాయి. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలంటే ముందుగా పొలాలను ప్లాస్టిక్ రహితంగా మార్చాలి. వ్యవసాయ ప్యాకింగ్ లో వాడే ప్లాస్టిక్ ను తగ్గించేలా శాస్త్రవేత్తలు కొత్త మార్గాలను అన్వేషించాలి. భూమి తల్లిని ప్లాస్టిక్ సంకెళ్ల నుండి విముక్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పాఠశాల స్థాయి నుండే ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. పిల్లలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తే, వారు తమ తల్లిదండ్రులను కూడా ప్రభావితం చేయగలరు. 'ప్లాస్టిక్ రహిత పాఠశాల' వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలి. భవిష్యత్ పౌరులైన విద్యార్థులకు పర్యావరణ స్పృహను పెంపొందించడం ద్వారా దీర్ఘకాలిక మార్పును తీసుకురావచ్చు. పాఠశాల క్యాంటీన్లలో ప్లాస్టిక్ ప్లేట్లు, స్పూన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటడమే కాకుండా, తన పరిసరాలను ప్లాస్టిక్ రహితంగా ఉంచుతానని ప్రతిజ్ఞ చేయాలి. విద్యా సంస్థలు పర్యావరణ పరిరక్షణలో రోల్ మోడల్స్ గా నిలవాలి. సమాజంలో మార్పు అనేది తరగతి గది నుండే ప్రారంభం కావాలి. పరిశ్రమలు కూడా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి. తాము ఉత్పత్తి చేసే ప్లాస్టిక్ ప్యాకేజింగ్ ను తిరిగి సేకరించే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా పనిచేసే బయో-ప్యాకేజింగ్ స్టార్టప్ లను పెద్ద కంపెనీలు ప్రోత్సహించాలి. ఉత్పత్తి దశలోనే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వల్ల వ్యర్థాల సమస్య సగానికి పైగా పరిష్కారమవుతుంది. పర్యావరణ హితమైన పద్ధతులను పాటించే పరిశ్రమలకు ప్రభుత్వం పన్ను రాయితీలు ఇవ్వాలి. టెక్నాలజీని ఉపయోగించి ప్లాస్టిక్ ను ఇంధనంగా మార్చే పరిశోధనలు మరింత వేగవంతం కావాలి. పారిశ్రామికాభివృద్ధి పర్యావరణానికి ముప్పుగా మారకూడదు. చివరిగా, భూమిని ప్లాస్టిక్ కాలుష్యం నుండి విముక్తి చేయడం అంటే మనల్ని మనం రక్షించుకోవడమే. భూమిపై ఉన్న ప్రతి అంగుళం ప్లాస్టిక్ పొరతో నిండిపోతే, వర్షపు నీరు భూమిలోకి ఇంకదు, చెట్లు పెరగవు, ప్రాణవాయువు లభించదు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. 2026 నాటికి ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ప్రతి గ్రామం, ప్రతి నగరం నడుం బిగించాలి. రేపటి పచ్చని ప్రపంచం కోసం ఈరోజు మనం ప్లాస్టిక్ ను త్యజించాలి. ప్లాస్టిక్ రహిత పర్యావరణం మనందరి నినాదం కావాలి, అది కేవలం మాటల్లోనే కాదు, మన చేతల్లో కూడా కనిపించాలి. అప్పుడే మనం రాబోయే తరాలకు ఒక సురక్షితమైన, ఆరోగ్యకరమైన భూమిని అందించగలం.

# చికెన్ ధరల షాక్..

- ఒక్కరోజులో రూ.70 పెరుగుదల
- ఎండలు, డిమాండ్ పెరుగుదలతో రేట్ల ఎగబాకం
- నాటుకోడి ధర కిలో రూ.800.. మటన్‌తో పోటీ
- వినియోగదారులకు భారంగా మారిన ఆదివారం భోజనం



డెస్క్, మార్చి 21 , మన గళం : తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకి వినియోగదారులకు భారీ షాక్ ఇచ్చాయి. నిన్నటి వరకు సాధారణంగా ఉన్న ధరలు కేవలం ఒక్క రోజులోనే భారీగా పెరిగి మార్కెట్‌ను కుదిపేశాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చికెన్ ధర కిలోకు దాదాపు రూ.70 వరకు పెరగడం గమనార్హం. దీంతో ఆదివారం భోజనం కోసం చికెన్ కొనాలనుకున్న వారికి ఖర్చు రెట్టింపు అయిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం విజయవాడలో స్కిన్‌లెస్ చికెన్ కిలో ధర రూ.380 నుంచి రూ.400 వరకు పలుకుతుండగా, హైదరాబాద్‌లో రూ.340 నుంచి రూ.350 మధ్య విక్రయిస్తున్నారు. ఇక నాటుకోడి ధరలు మరింత పెరిగి కిలోకు రూ.800 వరకు చేరాయి. ఈ రేట్లు మటన్ ధరలతో పోటీ పడుతున్న స్థాయికి చేరుకోవడం వినియోగదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ధరల పెరుగుదల వెనుక పలు కీలక కారణాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. తీవ్ర ఎండల కారణంగా కోళ్లు పెద్ద సంఖ్యలో మృతి చెందడంతో మార్కెట్‌లో సరఫరా తగ్గిపోయింది. మరోవైపు రంజాన్ పండుగ నేపథ్యంలో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, శుభకార్యాలు అధికంగా ఉండటంతో డిమాండ్ మరింత పెరిగింది.

అదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగాయి. కోళ్లకు ఇచ్చే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు అదనపు భారం మోయలేక ధరలను పెంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అన్ని అంశాలు కలిసి చికెన్ ధరలను ఒక్కసారిగా పెంచినట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. మొత్తంగా చూస్తే, సరఫరా తగ్గడం, డిమాండ్ పెరగడం వల్ల చికెన్ ధరలు మరికొంతకాలం అధికంగానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధరలు తగ్గే వరకు వినియోగదారులు ప్రత్యామ్నాయాలను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# వాటర్ బాటిళ్ల ధరలు పెరిగాయి



న్యూఢిల్లీ, మార్చి 21, మన గళం :
దేశవ్యాప్తంగా సామాన్యులకు మరో షాక్ తగిలింది. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో వాటర్ బాటిళ్ల ధరలు గణనీయంగా పెరిగాయి. నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్లాస్టిక్ ఉత్పత్తుల ఖర్చులు అధికమయ్యాయి. దీంతో తాగునీటి బాటిళ్ల ధరలను కంపెనీలు 8 నుంచి 11 శాతం వరకు పెంచాయి.

ప్రధానంగా  వంటి కంపెనీలు ధరలను సవరించాయి. ఉదాహరణకు 1 లీటర్ బాటిళ్ల 12 ప్యాక్ ధర రూ.216 నుంచి రూ.240కు పెరిగింది. ప్యాకేజింగ్ మెటీరియల్, పాలిమర్, మూతలు, కార్టన్ బాక్స్‌లు వంటి ఖర్చులు పెరగడం వల్ల ధరలు పెంచక తప్పలేదని సంస్థలు వెల్లడించాయి. ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే పాలిమర్ ధరలు ముడి చమురు ధరలపై ఆధారపడి ఉంటాయి. చమురు ధరలు పెరగడంతో పాలిమర్ ధరలు కూడా భారీగా పెరిగాయి. ప్లాస్టిక్ పదార్థాల ధరలు సుమారు 50 శాతం వరకు పెరిగి కిలోకు రూ.170కు చేరాయి. మూతల ధరలు రెండింతలు పెరగడం కూడా ఉత్పత్తి ఖర్చును మరింత పెంచింది.

ఇక కేంద్ర ప్రభుత్వం గతంలో జీఎస్టీని తగ్గించినప్పటికీ, ప్రస్తుతం పెరిగిన ముడి సరుకు ఖర్చుల కారణంగా ఆ ప్రయోజనం కనిపించడం లేదు. ప్రీమియం బ్రాండ్ల బాటిళ్ల ధరలు కూడా ఇదే స్థాయిలో పెరిగాయి.

దేశంలో భూగర్భ జలాలు కలుషితమవుతుండటంతో తాగునీటి కోసం చాలా మంది బాటిళ్లపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ధరలు పెరగడం వినియోగదారులకు భారంగా మారింది. ముఖ్యంగా ఎండాకాలం కావడంతో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో ధరలు ఇంకా పెరగవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రాణాయామం శక్తి శ్వాసతోనే ఆరోగ్యానికి సంపూర్ణ మార్గం


- శరీరమనస్సు సమతుల్యానికి ప్రాణాయామం
- గుండె నుంచి మెదడు వరకు సమగ్ర ప్రయోజనాలు
- నిత్యజీవితంలో భాగం చేస్తేనే ఫలితం



డెస్క్, మార్చి 20 మన గళం, ఆరోగ్యం : ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా, ముఖ్యంగా ప్రాణాయామం ప్రాముఖ్యత మరింత పెరిగింది. చాలా మంది యోగా అంటే కేవలం ఆసనాలు మాత్రమే అనుకుంటారు. కానీ ప్రాణాయామం అనే శ్వాస సాధన యోగాలో అత్యంత కీలక భాగంగా ఉంటుంది. మన శరీరంలో ఉన్న ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యాన అనే పంచ ప్రాణాల సమన్వయానికి ప్రాణాయామం సహాయపడుతుంది. ఇవి శరీరంలోని జీవక్రియలు, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, నరాల వ్యవస్థ, విసర్జన వంటి ముఖ్య ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడతాయి. ప్రాణాయామం హృదయ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. లోతైన శ్వాస తీసుకోవడం ద్వారా పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ ఉత్తేజితమై శరీరం ప్రశాంత స్థితికి చేరుతుంది. దీని వల్ల రక్తపోటు, గుండె స్పందన రేటు నియంత్రణలో ఉండి గుండె సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గుతుంది. అదేవిధంగా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడి శరీరానికి తగినంత ఆక్సిజన్ అందుతుంది. శ్వాసకోశ వ్యవస్థ బలపడటంతో ఆయాసం, ఉబ్బసం వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి.

జీర్ణక్రియలో కూడా ప్రాణాయామం కీలకంగా పనిచేస్తుంది. డయాఫ్రమాటిక్ శ్వాస ద్వారా వేగస్ నరం ఉత్తేజితమై జీర్ణ అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే శరీరంలో పోషకాలు సరిగా శోషించబడటానికి కూడా ఇది సహాయపడుతుంది. ప్రాణాయామం క్రమం తప్పకుండా చేయడం వల్ల శరీరంలోని శక్తి స్థాయిలు పెరిగి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. మానసిక ఆరోగ్య పరంగా కూడా ప్రాణాయామం గొప్ప ప్రయోజనాలను అందిస్తుంది. శ్వాస వ్యాయామాలు నాడీ వ్యవస్థను శాంతపరచి మెదడుకు ఆక్సిజన్ సరఫరాను పెంచుతాయి. దీని వల్ల ఆందోళన, ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే సామర్థ్యం మెరుగుపడతాయి. విద్యార్థులు, ఉద్యోగస్తులు రోజువారీ జీవితంలో మెరుగైన పనితీరును కనబరచడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ప్రాణాయామం నిద్ర నాణ్యతను కూడా మెరుగుపరుస్తుంది. అనులోమవిలోమ, భ్రమరి వంటి పద్ధతులు శరీరంలో మెలటోనిన్ స్థాయిలను సమతుల్యం చేసి గాఢ నిద్రకు దోహదపడతాయి. నిద్రలేమి, రాత్రి భయాలు వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా రక్తంలో గ్లూకోజ్ స్థాయిల నియంత్రణలో కూడా ఇది సహాయపడుతుంది. ఇన్సులిన్ స్పందనను మెరుగుపరచి శరీరం చక్కెరను సమర్థవంతంగా వినియోగించుకునేలా చేస్తుంది. రోగనిరోధక శక్తి పెంపులో కూడా ప్రాణాయామం ప్రభావవంతంగా ఉంటుంది. లోతైన శ్వాస ద్వారా శరీరానికి అందే ఆక్సిజన్ వల్ల రక్తప్రసరణ మెరుగుపడి తెల్ల రక్త కణాలు వేగంగా శరీరమంతా విస్తరిస్తాయి. దీని వల్ల శరీరం వ్యాధికారక క్రిములతో సమర్థంగా పోరాడగలదు. తరచూ జలుబు, దగ్గు వంటి సమస్యలు వచ్చే వారికి ఇది ఉపశమనం కలిగిస్తుంది.


అయితే ప్రాణాయామాన్ని సరైన విధానంలో, క్రమం తప్పకుండా చేయడం చాలా ముఖ్యం. తొలిసారి చేసే వారు నిపుణుల మార్గదర్శకత్వంలో నేర్చుకోవడం మంచిది. ఉదయం స్వచ్ఛమైన గాలిలో, ప్రశాంత వాతావరణంలో ప్రాణాయామం చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుంది. అతిగా చేయడం లేదా తప్పుగా చేయడం వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి శరీర స్థితిని బట్టి మెల్లగా ప్రారంభించి క్రమంగా పెంచుకోవాలి. మొత్తం మీద ప్రాణాయామం శ్వాస సాధన మాత్రమే కాకుండా, సంపూర్ణ ఆరోగ్యానికి మార్గదర్శిగా నిలుస్తుంది.



# రోజ్ వాటర్ చర్మం, జుట్టుకు సహజ సంరక్షణ

డెస్క్, మార్చి 20 ,మన గళం, ఆరోగ్యం : రంగురంగుల గులాబీలు కేవలం మనసుకు ఆహ్లాదాన్ని మాత్రమే కాదు, సౌందర్య పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయి. గులాబీ రేకులను నీటిలో మరిగించి తయారు చేసే రోజ్ వాటర్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉండటం వల్ల ఇది చర్మం, జుట్టుకు అనేక విధాలుగా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. రోజ్ వాటర్ చర్మానికి సహజ టోనర్‌లా పనిచేస్తుంది. ఇది చర్మంలోని జూఎ స్థాయిని సమతుల్యం చేయడంలో, రంధ్రాలను బిగుతుగా చేయడంలో, వాపు తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ఫేస్ మిస్ట్‌గా ఉపయోగిస్తే చర్మానికి తక్షణమే తాజాదనం, తేమను అందిస్తుంది. క్లెన్సర్‌గా ఉపయోగించడం ద్వారా ముఖంపై పేరుకుపోయిన మురికి, జిడ్డును తొలగించి చర్మాన్ని శుభ్రంగా ఉంచుతుంది. కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గించడంలో కూడా రోజ్ వాటర్ ఉపయోగకరంగా ఉంటుంది. కాటన్‌ను రోజ్ వాటర్‌లో ముంచి కళ్ల కింద మృదువుగా రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇందులో ఉన్న యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటలను తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు సంరక్షణలో కూడా రోజ్ వాటర్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇది సహజ కండిషనర్‌లా పనిచేసి జుట్టుకు తేమను అందిస్తుంది. చుండ్రును తగ్గించడంలో, తల చర్మంపై దురదను తగ్గించడంలో, జుట్టుకు మెరుపు తీసుకురావడంలో ఉపయోగపడుతుంది. షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్కలు కలిపి వాడినా, గులాబీ రేకల పేస్ట్‌ను తలకు రాసి కడిగినా మంచి ఫలితాలు పొందవచ్చు. మొత్తంగా రోజ్ వాటర్ సహజమైన, సురక్షితమైన సౌందర్య సంరక్షణ మార్గంగా నిలుస్తోంది.





# చిన్నపిల్లల్లో పోషక లోపాలు



డెస్క్, మార్చి 20 మన గళం, ఆరోగ్యం : చిన్నపిల్లల ఆరోగ్యం పూర్తిగా వారి పోషణపై ఆధారపడి ఉంటుంది. సరైన ఆహారం అందకపోవడం లేదా ముఖ్యమైన పోషకాల లోపం ఏర్పడటం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి ప్రభావితమవుతుంది. ముఖ్యంగా ఇనుము, కాల్షియం లోపాలు పిల్లల్లో ఎక్కువగా కనిపించే సమస్యలు. ఇవి ప్రారంభంలో స్పష్టంగా కనిపించకపోయినా, తరువాత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఇనుము లోపం వల్ల రక్తంలో హేమోగ్లోబిన్ స్థాయిలు తగ్గిపోతాయి. దాంతో పిల్లలు అలసటగా ఉండడం, ముఖం కాంతి తగ్గడం, ఆకలి లేకపోవడం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తహీనతకు ఇది ప్రధాన కారణంగా మారుతుంది. ఇనుము శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే ఈ లోపాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.కాల్షియం లోపం ఎముకలు, దంతాల అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. పిల్లల్లో ఎముకలు బలహీనపడటం, దంతాలు ఆలస్యంగా రావడం, కండరాల బలహీనత, తరచుగా కిందపడటం వంటి లక్షణాలు కనిపించవచ్చు. విటమిన్ డి సహకారం లేకుండా కాల్షియం శరీరంలో సరిగ్గా శోషించబడదు. కాబట్టి పిల్లలను ఉదయం సూర్యకిరణాల్లో కొద్దిసేపు ఆడించటం కూడా అవసరం.

ఈ లోపాలను నివారించేందుకు సమతుల్య ఆహారం అత్యంత ముఖ్యమైనది. ఆకుకూరలు, పప్పులు, ధాన్యాలు, బెల్లం, ఖర్జూరాలు, పండ్లు వంటి ఇనుము అధికంగా ఉండే ఆహారాలు ఇవ్వాలి. అలాగే పాలు, పెరుగు, నువ్వులు, బాదం వంటి కాల్షియం పదార్థాలు ఆహారంలో భాగం చేయాలి. జంక్ ఫుడ్‌ను తగ్గించి, అవసరమైతే వైద్యుల సలహాతో మాత్రమే సప్లిమెంట్లు ఇవ్వాలి. సరైన సంరక్షణ, ఆహార అలవాట్ల ద్వారా పిల్లలను ఆరోగ్యవంతంగా, బలంగా పెంచుకోవచ్చు.

# తేనెటీగ కాటు వెంటనే చేయాల్సిన చిట్కాలు



డెస్క్, మార్చి 20,మన గళం, ఆరోగ్యం : తోటల్లో పనిచేసేటప్పుడు లేదా బయట తిరిగేటప్పుడు తేనెటీగలు కుట్టడం సాధారణమే. కానీ కుట్టిన వెంటనే వచ్చే నొప్పి, మంట చాలా ఇబ్బంది కలిగిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇది ఇన్ఫెక్షన్ లేదా అలర్జీకి దారితీసే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి తేనెటీగ కాటు పడిన వెంటనే సరైన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. తేనెటీగ కుట్టిన వెంటనే చర్మంలో ఉండే ముల్లును తొలగించడం అత్యంత ముఖ్యమైన పని. గోళ్లతో లేదా పల్చటి వస్తువుతో జాగ్రత్తగా ముల్లును తీసివేయాలి. గట్టిగా నొక్కడం వల్ల విషం మరింత లోపలికి వెళ్లే ప్రమాదం ఉంది. ఆ తరువాత కుట్టిన ప్రాంతాన్ని యాంటీసెప్టిక్ సబ్బుతో, చల్లటి నీటితో శుభ్రం చేయాలి. వాపు తగ్గించడానికి ఐస్ గడ్డను గుడ్డలో చుట్టి అక్కడ ఉంచడం ద్వారా నొప్పి, వాపు తగ్గుతాయి.




ఇంట్లోనే అందుబాటులో ఉండే కొన్ని సాధారణ వస్తువులతో కూడా ఉపశమనం పొందవచ్చు. వైట్ టూత్‌పేస్ట్‌ను రాస్తే మంట తగ్గుతుంది. అలాగే బేకింగ్ సోడాను నీటితో కలిపి పేస్ట్‌లా చేసి రాయడం వల్ల విష ప్రభావం తగ్గుతుంది. తేనెను రాయడం ద్వారా గాయం త్వరగా మానటానికి సహాయపడుతుంది, ఇది యాంటీబ్యాక్టీరియల్‌గా పనిచేస్తుంది. అయితే కొన్ని సందర్భాల్లో అలర్జీ లక్షణాలు తీవ్రంగా కనిపించవచ్చు. శరీరం మొత్తం దద్దుర్లు రావడం, గొంతు వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. తేనెటీగలు సాధారణంగా మనల్ని ఇబ్బంది పెట్టవు, కానీ ప్రమాదం అనిపించినప్పుడు మాత్రమే కుడతాయి. కాబట్టి జాగ్రత్తగా ఉండటం, తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా సమస్యను సులభంగా నియంత్రించవచ్చు.

# ప్రయోజనాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలు



డెస్క్, మార్చి 20 మన గళం, ఆరోగ్యం : ఇటీవలి కాలంలో కొల్లాజెన్ సప్లిమెంట్ల వినియోగం గణనీయంగా పెరిగింది. మెరిసే చర్మం, బలమైన జుట్టు, గోర్లు, కీళ్ల ఆరోగ్యం కోసం చాలా మంది వీటిని ఉపయోగిస్తున్నారు. కొల్లాజెన్ అనే ప్రోటీన్ మన శరీరంలో సహజంగా ఉత్పత్తి అవుతూ చర్మం, ఎముకలు, టెండన్స్, కార్టిలేజ్ నిర్మాణాన్ని బలపరుస్తుంది. అయితే వయస్సు పెరిగేకొద్దీ ఈ ఉత్పత్తి తగ్గిపోవడంతో సప్లిమెంట్లపై ఆధారపడే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే కొల్లాజెన్ సప్లిమెంట్లు పూర్తిగా సురక్షితమైనవని చెప్పలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తీసుకున్న తర్వాత కొందరికి కడుపు ఉబ్బరం, నిండుగా అనిపించడం, గుండెల్లో మంట, వాంతులు వంటి జీర్ణ సంబంధ సమస్యలు కనిపించవచ్చు. ముఖ్యంగా చేపల నుంచి తీసే మెరైన్ కొల్లాజెన్ వల్ల కొందరికి అలర్జీ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దురదలు, చర్మంపై దద్దుర్లు, గొంతులో అసౌకర్యం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇంకా కొల్లాజెన్ సప్లిమెంట్ల నాణ్యత కూడా కీలక అంశంగా మారింది. కొన్ని ఉత్పత్తుల్లో భారీ లోహాల ఆనవాళ్లు ఉండే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే వీటిని అధిక మోతాదులో తీసుకోవడం వల్ల శరీరంలో ప్రోటీన్ స్థాయిలు పెరిగి కిడ్నీలపై ఒత్తిడి పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అదనంగా, చర్మం మెరుగుపడటంలో లేదా కీళ్ల నొప్పి తగ్గించడంలో వీటి ప్రభావంపై శాస్త్రీయ ఆధారాలు మిశ్రమంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి కొల్లాజెన్ సప్లిమెంట్లపై పూర్తిగా ఆధారపడకుండా సహజ మార్గాలను అనుసరించడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. విటమిన్ సి అధికంగా ఉండే నిమ్మకాయలు, బెర్రీలు, కాప్సికమ్ వంటి ఆహారాలు, గుడ్లు, చేపలు, పప్పులు వంటి ప్రోటీన్ పదార్థాలు తీసుకోవాలి. అలాగే సూర్యరశ్మి నుండి చర్మాన్ని రక్షించుకోవడం, పొగ తాగడం మానేయడం, సరైన నిద్ర, వ్యాయామం ద్వారా సహజంగా కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుకోవచ్చు. సప్లిమెంట్లు తీసుకునే ముందు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.




## ‘ఉస్తాద్ భగత్ సింగ్’కు కలెక్షన్ షాక్

హైదరాబాద్, మార్చి 21 ,మన గళం, సినిమా : ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రం బాక్సాఫీస్ వద్ద అనూహ్య మలుపు తీసుకుంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజు మంచి వసూళ్లు సాధించినప్పటికీ, రెండో రోజు కలెక్షన్స్‌లో భారీ పతనం నమోదైంది. ఉగాది సందర్భంగా విడుదలైన ఈ సినిమా తొలి రోజు దేశవ్యాప్తంగా సుమారు రూ. 34 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించగా, రెండో రోజు మాత్రం ఆ వేగాన్ని కొనసాగించలేక సుమారు రూ. 9 కోట్లకే పరిమితమైంది. రెండు రోజుల్లో మొత్తం ఇండియా నెట్ కలెక్షన్స్ సుమారు రూ. 44 కోట్లకు చేరగా, ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 59 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చినట్లు సమాచారం. రెండో రోజు కలెక్షన్స్ పడిపోవడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సినిమాకు వచ్చిన మిశ్రమ స్పందన ప్రేక్షకులను కొంత వెనక్కి తగ్గేలా చేసింది. అదనంగా వర్కింగ్ డే కావడం వల్ల థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. మరోవైపు రణవీర్ సింగ్ నటించిన ‘ధురంధర్ 2’ హిందీ వెర్షన్ పోటీ కూడా కొంత ప్రభావం చూపినట్లు ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో ఈ పోటీ స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం ఈ సినిమా భవితవ్యం పూర్తిగా వీకెండ్ కలెక్షన్స్‌పైనే ఆధారపడి ఉంది. రంజాన్ సెలవులు, శని–ఆదివారాల్లో వసూళ్లు పెరిగితేనే చిత్రం మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది. అయితే పోటీ మరింత పెరగనుంది. ‘ధురంధర్ 2’ తెలుగు వెర్షన్ కూడా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పరిస్థితి సవాలుగా మారింది. పవన్ కళ్యాణ్ గత చిత్రం ‘ఓజీ’ భారీ విజయానంతరం వచ్చిన ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కానీ ప్రస్తుత ట్రెండ్ చూస్తే, ఈ చిత్రం విజయావకాశాలు పూర్తిగా వచ్చే రెండు రోజుల ప్రదర్శనపైనే ఆధారపడి ఉన్నట్లు స్పష్టమవుతోంది.

## సందీప్ కిషన్ ఫాంటసీ అడ్వెంచర్ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 21,మన గళం, సినిమా : యువ కథానాయకుడు సందీప్ కిషన్ తన కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల ‘శంబాల’ చిత్రంతో మంచి విజయాన్ని అందుకుని ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు యుగంధర్ ముని ఇప్పుడు అదే స్థాయి కాన్సెప్ట్‌తో సందీప్ కిషన్‌ను కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రం హై–వోల్టేజ్ ఫాంటసీ అడ్వెంచర్‌గా తెరకెక్కనుంది. “కొన్ని యుద్ధాలు ముగియవు.. కొంతమంది రాజులు మరణించరు” అనే శక్తివంతమైన ట్యాగ్‌లైన్‌తో విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా నేపథ్యంపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది చారిత్రక లేదా పురాణ నేపథ్యంతో కూడిన భారీ ఎపిక్ కథగా ఉండబోతోందని స్పష్టమవుతోంది. రాజశేఖర్ అన్నభిమోజు, మహిధర్ రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో, అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లో 33వ చిత్రంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆయన పూర్తిగా భిన్నమైన మేకోవర్‌లో కనిపించనున్నారని సమాచారం. విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళ భాషల్లో ఒకేసారి విడుదల చేయాలని చిత్ర బృందం ప్రణాళిక రూపొందిస్తోంది. విభిన్న కథలను ఎంచుకోవడంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సందీప్ కిషన్, ఈ ఎపిక్ అడ్వెంచర్‌తో పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను మరింత విస్తరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.




## ‘రాకాస’తో నిహారిక రీఎంట్రీ



హైదరాబాద్, మార్చి 21,మన గళం, సినిమా : మెగా ఫ్యామిలీకి చెందిన నటి, నిర్మాత కొణిదెల నిహారిక మరోసారి వార్తల్లో నిలిచారు. హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించి, తరువాత నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇప్పుడు ‘రాకాస’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ‘పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్’ బ్యానర్‌పై నిర్మించిన ‘కమిటీ కుర్రాళ్లు’ విజయం తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ చిత్రంలో సంగీత్ శోభన్ హీరోగా నటిస్తుండగా, ఇది హర్రర్–కామెడీతో పాటు ఫాంటసీ అంశాలు కలిసిన వినోదాత్మక చిత్రంగా రూపొందుతోంది. కుటుంబ సమేతంగా చూసేలా క్లీన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తీర్చిదిద్దామని నిహారిక వెల్లడించారు. ఇదివరకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’ మంచి విజయాన్ని సాధించగా, ఇప్పుడు అదే కాంబోలో సినిమా రావడం ఆసక్తిని పెంచుతోంది. ఏప్రిల్ 3న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉండగా, కొంతకాలంగా నటనకు దూరంగా ఉన్న నిహారిక మళ్లీ కెమెరా ముందు నిలబడాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం పలు కథలు వింటున్నానని, అందులో కొన్ని కథలు తనకు బాగా నచ్చాయని ఆమె తెలిపారు. అన్ని అనుకూలిస్తే 2027లో మళ్లీ హీరోయిన్‌గా ప్రేక్షకుల ముందుకు రావాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో నిహారిక సెకండ్ ఇన్నింగ్స్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరిగింది.

# టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా దిశగా



హైదరాబాద్, మార్చి 21 ,మన గళం, సినిమా : శ్రీలీల తెలుగు, కన్నడ చిత్రసీమల్లో తన ప్రతిభతో వేగంగా ఎదిగిన యువ నటి. అద్భుతమైన అభినయం, ఎనర్జిటిక్ డ్యాన్స్‌లతో తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో ప్రముఖ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. 2001 జూన్ 14న అమెరికాలో జన్మించిన ఆమె, బెంగళూరులో పెరిగింది. శ్రీలీల సినీ ప్రస్థానం 2019లో వచ్చిన కన్నడ చిత్రం ‘కిస్’తో ప్రారంభమైంది. ఆ సినిమాలోనే తన నటన, నృత్యంతో మంచి గుర్తింపు సంపాదించింది. అనంతరం 2021లో కే. రాఘవేంద్ర రావు దర్శకత్వంలో తెరకెక్కిన ‘పెళ్లి సందడి’తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. ఈ చిత్రం ద్వారా ఆమెకు భారీగా క్రేజ్ వచ్చింది. తరువాత టాలీవుడ్‌లో వరుస అవకాశాలు దక్కించుకున్న శ్రీలీల, ప్రముఖ హీరోల సరసన నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ముఖ్యంగా రవితేజతో చేసిన ‘ధమాకా’, నందమూరి బాలకృష్ణతో చేసిన ‘భగవంత్ కేసరి’, అలాగే మహేష్ బాబుతో నటించిన ‘గుంటూరు కారం’ వంటి చిత్రాలు ఆమెకు మరింత గుర్తింపు తీసుకువచ్చాయి. తన స్టెప్పులు, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇక 2026 నాటికి శ్రీలీల తన కెరీర్‌ను ఇతర భాషల వైపు విస్తరించుకుంటోంది. తమిళంలో ‘పరాశక్తి’ చిత్రంతో అరంగేట్రం చేయనుండగా, బాలీవుడ్‌లో కూడా ఒక రొమాంటిక్ చిత్రంతో ఎంట్రీ ఇవ్వబోతోంది. దీంతో ఆమె పాన్ ఇండియా స్థాయిలో తన మార్కెట్‌ను పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. సినిమాలకే పరిమితం కాకుండా, సేవా కార్యక్రమాల్లో కూడా శ్రీలీల చురుకుగా పాల్గొంటోంది. అనాథ పిల్లల కోసం “హియర్ ఫర్ యూ” అనే కార్యక్రమాన్ని ప్రారంభించి, సామాజిక బాధ్యతను చాటుతోంది. తన స్టార్‌డమ్‌ను సేవకు ఉపయోగించడం ద్వారా అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.



## ఐర్లాండ్‌తో టీమిండియా టీ20 సిరీస్..






ముంబై, మార్చి 21 ,మన గళం: భారత క్రికెట్ నియంత్రణ మండలి జూన్ నెలకు సంబంధించిన అంతర్జాతీయ షెడ్యూల్‌ను ప్రకటిస్తూ కీలక నిర్ణయం వెల్లడించింది. టీమిండియా ఐర్లాండ్ జట్టుతో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుందని స్పష్టం చేసింది. ఈ మ్యాచ్‌లు జూన్ 26, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు బెల్‌ఫాస్ట్ వేదికగా నిలవనుంది. ముఖ్యంగా 2007 తర్వాత మళ్లీ అదే మైదానంలో భారత జట్టు మ్యాచ్ ఆడనుండటం విశేషంగా మారింది. అప్పటి నుంచి అనేకసార్లు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పటికీ, బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌లు జరగలేదు. ఇప్పుడు మళ్లీ ఈ వేదికపై మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. గత ఎనిమిదేళ్లలో భారత జట్టు మూడు సార్లు ఐర్లాండ్ పర్యటన చేసింది. 2018, 2022, 2023 సంవత్సరాల్లో అక్కడ సిరీస్‌లు ఆడింది. అయితే ఈసారి షెడ్యూల్‌లో ప్రత్యేకత ఏమిటంటే, ఇంగ్లండ్ పర్యటనకు ముందే ఐర్లాండ్ సిరీస్‌ను ప్లాన్ చేయడం. దీంతో విదేశీ పరిస్థితులకు ఆటగాళ్లు అలవాటు పడేందుకు ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు. ఈ టూర్‌కు ముందు భారత జట్టు ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్ట్ మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. ఈ సిరీస్ జూన్ 20 నాటికి ముగియనుంది. అనంతరం వెంటనే ఐర్లాండ్ పర్యటన ప్రారంభమవుతుంది. వరుసగా మ్యాచ్‌లు ఉండటంతో ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్టు సమతుల్యత కీలకంగా మారనుంది. ఇక ఐర్లాండ్ సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఇంగ్లండ్ పర్యటనకు బయలుదేరనుంది. జూలై 1 నుంచి 19 వరకు ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. ఈ సిరీస్ కూడా ఎంతో ప్రాధాన్యత కలిగినదిగా భావిస్తున్నారు. భవిష్యత్ అంతర్జాతీయ టోర్నీల దృష్ట్యా జట్టు కాంబినేషన్‌ను పరీక్షించేందుకు ఇది మంచి వేదికగా నిలవనుంది. మొత్తంగా చూస్తే, జూన్–జూలై నెలల్లో టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఎదురవుతోంది. ఐర్లాండ్ సిరీస్ చిన్నదైనా, ఇంగ్లండ్ పర్యటనకు ముందస్తు సన్నాహకంగా కీలక పాత్ర పోషించనుంది. యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడం, బెంచ్ స్ట్రెంగ్త్‌ను పరీక్షించడం వంటి అంశాల్లో ఈ మ్యాచ్‌లు ఎంతో ఉపయోగపడనున్నాయి.

## కోల్‌కతాకు వరుస షాక్‌లు.. గాయంతో ఆకాశ్ దీప్ ఔట్



ముంబై, మార్చి 21 ,మన గళం పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ ఆరంభానికి ముందే కోల్‌కతా నైట్ రైడర్స్‌జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రధాన పేసర్లు గాయాల కారణంగా దూరమవ్వగా, తాజాగా భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కూడా గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే హర్షిత్ రానా, మథీశ పథిరన గాయాల వల్ల జట్టుకు దూరమయ్యారు. దీంతో కోల్‌కతా పేస్ దళం తీవ్రంగా దెబ్బతింది. ఈ క్రమంలో ఆకాశ్ దీప్ ఉన్నాడనే నమ్మకంతో ఉన్న యాజమాన్యానికి అతని గాయం మరో పెద్ద షాక్‌గా మారింది. ఫలితంగా జట్టు బౌలింగ్ విభాగం దాదాపు ఖాళీ అయిన పరిస్థితి నెలకొంది. గత మూడు సీజన్లుగా కోల్‌కతా బౌలింగ్ దళానికి ప్రధాన బలంగా నిలిచిన హర్షిత్ రానా మోకాలి గాయంతో దూరమవ్వడం జట్టుకు పెద్ద లోటు. మరోవైపు వేలంలో భారీ ధరకు కొనుగోలు చేసిన మథీశ పథిరన ఆడడంపై కూడా అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఆకాశ్ దీప్‌పై ఆశలు పెట్టుకున్న ఫ్రాంచైజీకి అతని గాయం తీవ్ర నిరాశ కలిగించింది. ఇటీవలి కాలంలో గాయాలతో ఇబ్బంది పడుతున్న ఆకాశ్ దీప్ మైదానంలో కంటే రిహాబిలిటేషన్ కేంద్రంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నాడు. గత మినీ వేలంలో సుమారు ఒక కోటి రూపాయలకు కొనుగోలు చేసిన ఈ పేసర్ ఇప్పుడు టోర్నీకి దూరమవ్వడంతో జట్టుకు పెద్ద నష్టం కలిగింది. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ వర్గాలు కూడా ధృవీకరించాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కోల్‌కతా బౌలింగ్ బాధ్యతలు కొత్తగా జట్టులోకి వచ్చిన బ్లెస్సింగ్ ముజరబానీపై ఎక్కువగా పడనున్నాయి. అనుభవం తక్కువగా ఉన్న బౌలర్లతోనే జట్టు ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక పంతొమ్మిదో సీజన్ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు మార్చి 29న ముంబై జట్టుతో తలపడనుంది. వరుస గాయాలతో బలహీనపడిన జట్టు ఈ సీజన్‌లో ఎలా రాణిస్తుందో అనేది ఆసక్తికరంగా మారింది. అభిమానులు మాత్రం ఈ పరిస్థితుల్లో జట్టు ప్రదర్శనపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## తొలి మ్యాచ్‌లోనే శతకం.. చరిత్రను తిరగరాసిన పదిహేనేళ్ల బాలిక



కిగాలి, మార్చి 21,మన గళం : పొట్టి క్రికెట్‌లో మహిళలు కూడా తమ సత్తా ఏంటో మరోసారి చాటిచెప్పారు. రువాండా మహిళా జట్టు తరఫున అరంగేట్రం చేసిన పదిహేనేళ్ల బాలిక ఫాన్నీ ఉతగుషిమనిండే తొలి మ్యాచ్‌లోనే శతకం బాది చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ స్థాయిలో తన మొదటి మ్యాచ్‌లోనే ఇంతటి అద్భుత ప్రదర్శన చేయడం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఘనా జట్టుతో జరిగిన ఈ మ్యాచ్‌లో ఫాన్నీ ఉతగుషిమనిండే అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శించింది. కేవలం 65 బంతుల్లోనే 111 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమె ఇన్నింగ్స్‌లో అద్భుతమైన షాట్లు, ధైర్యంగా ఆడిన తీరు ప్రత్యేకంగా నిలిచాయి. బౌలర్లపై ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఆత్మవిశ్వాసంతో ఆడుతూ బౌండరీలు, సిక్సర్లతో చెలరేగింది. ఈ శతకంతో ఆమె అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అరంగేట్ర మ్యాచ్‌లోనే శతకం సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్రలో నిలిచింది. అంతేకాకుండా, మహిళల టీ20ల్లో శతకం బాదిన అత్యంత చిన్న వయస్కురాలిగా మరో ఘనతను కూడా తన పేరిట నమోదు చేసుకుంది. 15 సంవత్సరాలు 223 రోజుల వయసులో ఈ రికార్డు సాధించడం విశేషంగా మారింది. ఇప్పటి వరకు అరంగేట్ర మ్యాచ్‌లో అత్యధిక స్కోర్ సాధించిన రికార్డు 96 పరుగులతో ఉండేది. ఇప్పుడు ఫాన్నీ ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్రను సృష్టించింది. అలాగే అరంగేట్రంలోనే 90 పరుగులు చేసిన మరో ప్రముఖ ఆటగాళ్లు తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. అయితే ఫాన్నీ శతకం వారందరినీ వెనక్కి నెట్టింది.

తూర్పు ఆఫ్రికాలోని చిన్న దేశమైన రువాండాకు చెందిన ఈ బాలిక ప్రదర్శనతో ఆ దేశ క్రికెట్‌కు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. చిన్న దేశం నుంచి వచ్చినా ప్రతిభ ఉంటే ఎక్కడైనా నిలబడవచ్చని ఆమె నిరూపించింది. ఆమె ఆటను చూసిన తర్వాత భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించే సామర్థ్యం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, ఈ ఇన్నింగ్స్ మహిళా క్రికెట్‌లో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. చిన్న వయసులోనే అంతటి ధైర్యంతో ఆడుతూ చరిత్ర సృష్టించిన ఫాన్నీ ఉతగుషిమనిండే పేరు ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో మార్మోగుతోంది. భవిష్యత్తులో ఆమె ఇంకా ఎన్నో ఘనతలు సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## పాక్ కోచ్‌గా చేదు అనుభవం.. తొలిసారి స్పందించిన గ్యారీ కిర్‌స్టెన్



లండన్, మార్చి 21,మన గళం : భారత జట్టుకు 2011లో వన్డే ప్రపంచకప్ అందించిన ప్రముఖ కోచ్ గ్యారీ కిర్స్టన్, పాకిస్థాన్ జట్టుతో తన అనుభవంపై తొలిసారి నోరు విప్పాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 2024 ఏప్రిల్‌లో పాకిస్థాన్ జాతీయ క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కిర్‌స్టెన్, కేవలం ఆరు నెలలకే తన పదవికి రాజీనామా చేయడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఆ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ఆయన వెల్లడించారు. తాజాగా ఒక క్రీడా మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నుంచి ఊహించని స్థాయిలో జోక్యం ఎదురైందని కిర్‌స్టెన్ చెప్పారు. “నా కోచింగ్ కెరీర్‌లో ఇంతటి జోక్యాన్ని ఎప్పుడూ చూడలేదు. బయట నుంచి వచ్చే ఒత్తిడి, సూచనలు మధ్య జట్టుతో సమర్థవంతంగా పనిచేయడం చాలా కష్టం అవుతుంది” అని ఆయన పేర్కొన్నారు. జట్టు ఎంపిక, వ్యూహాల విషయంలో బోర్డు తరచూ జోక్యం చేసుకోవడం వల్ల తనకు ఇబ్బందులు కలిగాయని ఆయన తెలిపారు. “జట్టు సరిగా రాణించనప్పుడు కోచ్‌ను బాధ్యుడిగా నిలబెట్టడం సులభం. అలాంటప్పుడు కోచ్‌ను నియమించడం ఎందుకు?” అంటూ ఆయన ప్రశ్నించారు. కోచ్‌కు పూర్తి స్వేచ్ఛ ఇవ్వకుండా ఫలితాలు ఆశించడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. పాకిస్థాన్‌తో తన ప్రయాణాన్ని ముగించిన కిర్‌స్టెన్ ఇప్పుడు శ్రీలంక జాతీయ క్రికెట్ జట్టుహెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. 2026 ఏప్రిల్ 15 నుంచి రెండేళ్ల ఒప్పందంతో ఆయన శ్రీలంక జట్టుతో పనిచేయనున్నాడు. ఈ క్రమంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేయడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ ఓపెనర్‌గా కిర్‌స్టెన్ అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష విజయాలు సాధించాడు. టెస్టులు, వన్డేల్లో కలిపి 14 వేలకుపైగా పరుగులు నమోదు చేసిన ఆయన, కోచ్‌గా మారిన తర్వాత భారత్ వంటి జట్లకు చారిత్రాత్మక విజయాలు అందించాడు.

మొత్తంగా, పాకిస్థాన్ జట్టుతో తన అనుభవాన్ని బహిర్గతం చేస్తూ కిర్‌స్టెన్ చేసిన ఈ వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీశాయి. బోర్డు–కోచ్ సంబంధాలపై మరోసారి దృష్టి సారించేలా ఈ పరిణామం మారింది.

## వరల్డ్ కప్ 2027 నిబంధనలు ఇవే..



జోహన్నెస్‌బర్గ్, మార్చి 21,మన గళం : క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వరల్డ్ కప్ 2027 టోర్నీకి సంబంధించిన ఫార్మాట్, కొత్త నిబంధనలను అంతర్జాతీయ క్రికెట్ మండలి వెల్లడించింది. ఈసారి 14 జట్లతో, సరికొత్త విధానాలతో టోర్నీ మరింత ఉత్కంఠభరితంగా మారనుంది. ఈ ప్రపంచ కప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఆతిథ్య దేశాలుగా సౌతాఫ్రికా, జింబాబ్వేలకు నేరుగా టోర్నీలో ప్రవేశం లభించగా, నమీబియా మాత్రం అర్హత సాధన పోటీల ద్వారా అవకాశం పొందాలి. మార్చి 31, 2027 నాటికి వన్డే ర్యాంకింగ్స్‌లో మొదటి ఎనిమిది స్థానాల్లో ఉన్న జట్లు నేరుగా ఈ టోర్నీలోకి ప్రవేశిస్తాయి. మిగిలిన నాలుగు స్థానాల కోసం ప్రత్యేక అర్హత పోటీలు నిర్వహిస్తారు. దీంతో ఈసారి పోటీ మరింత కఠినంగా ఉండనుంది. సూపర్ సిక్స్ విధానం ప్రత్యేకత ఈసారి పాత విధానానికి బదులుగా సూపర్ సిక్స్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మొత్తం 14 జట్లను రెండు గ్రూపులుగా విభజిస్తారు. ఒక్కో గ్రూప్‌లో ఏడు జట్లు ఉంటాయి. లీగ్ దశలో ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని మిగతా జట్లతో తలపడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. అక్కడ పాయింట్ల ఆధారంగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. అనంతరం ఫైనల్ పోరుతో విజేతను నిర్ణయిస్తారు. ఈ విధానం వల్ల ప్రతి మ్యాచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడనుంది. మూడు ముఖ్య నిబంధనలు : ఈసారి టోర్నీలో మూడు కీలక నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయనున్నారు. మొదటిగా, మ్యాచ్ సమంగా ముగిసినట్లయితే సూపర్ ఓవర్ నిర్వహించడం తప్పనిసరి. విజేత తేలే వరకు సూపర్ ఓవర్లు కొనసాగిస్తారు. గతంలో జరిగిన వివాదాలకు ఇది పూర్తి స్థాయిలో ముగింపు పలికే అవకాశం ఉంది. రెండవది, సాఫ్ట్ సిగ్నల్ విధానాన్ని పూర్తిగా తొలగించారు. ఇకపై ఫీల్డ్ అంపైర్ ఇచ్చే ప్రాథమిక అభిప్రాయం ఉండదు. మూడవ అంపైర్ స్పష్టమైన ఆధారాల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటాడు. మూడవది, మైదానాల్లో బౌండరీ పరిమాణంపై కఠిన నిబంధనలు అమలు చేస్తారు. బౌండరీ లైన్ కనీసం 70 మీటర్లకు తగ్గకుండా ఉండాలని స్పష్టం చేశారు. దీని వల్ల ఆటలో సమతుల్యత పెరుగుతుంది. వేదికలు, పరిస్థితులు : ఈ టోర్నీ ప్రధానంగా సౌతాఫ్రికాలో జరుగనుండగా, జింబాబ్వే, నమీబియాలోని కొన్ని మైదానాలను కూడా వినియోగించనున్నారు. ఆఫ్రికా మైదానాలు సాధారణంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉండటంతో ఈసారి బౌలర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉండే అవకాశముంది. మొత్తంగా చూస్తే, కొత్త విధానాలు, కఠిన నిబంధనలతో ఈసారి వరల్డ్ కప్ మరింత ఆసక్తికరంగా మారనుంది. ప్రతి మ్యాచ్ కీలకంగా మారే ఈ టోర్నీ అభిమానులకు ఉత్కంఠభరిత అనుభూతిని అందించనుంది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.